క్లుప్తంగా

సచివాలయ కార్యదర్శులకు శిక్షణ నేడు

అక్కిరెడ్డిపాలెం: ఎంపీఈపీలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సేవా నియమాలు, ప్రవర్తనా నియమాలు, రికార్డ్ కీపింగ్ తదితర అంశాలపై జీవీఎంసీలోని వార్డు సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. జోన్-6, 69వ వార్డులో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి పక్కనున్న ఎంపీఈపీ స్కూల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్న కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలియజేశారు.

నేప్‌కిన్స్ తయారీలో శిక్షణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంపత్‌కుమార్

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీలోని శ్రీ లిఖి ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మై ప్యాడ్ మై రైట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నాబార్డ్ డీడీఎం సపంత్‌కుమార్ ప్రారంభించారు. మహిళలు శానిటరీ నేప్‌కిన్స్ వాడడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. శానిటరీ నేప్‌కిన్స్ తయారీ శిక్షణ తరగతులను ప్రారంభించారు.ముంబైకి చెందిన నాబార్డ్ ఫౌండేషన్ సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు శ్రీలిఖి ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి జి.మాధవి తెలిపారు.

వైభవంగా అప్పన్న తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో అధిష్టంపజేశారు. ఆలయ బేడామండపంలో సాయంత్రం తిరువీధి ఘనంగా నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిపించారు. అధిక శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతాల్లో దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి ఆధ్వర్యంలో పురాణ పండితుడు చల్లా సత్యనారాయణ సత్యనారాయణ వ్రతం ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టు జంక్షన్‌లో క్రైస్తవ సమితి సభ్యులు



వెల్‌కమ్ సీఎం సర్ ప్లకార్డులతో నిల్చున్న కార్యకర్తలు, మహిళలు



ఎన్‌ఏడీ జంక్షన్‌లో ముఖ్యమంత్రి కోసం వేచి ఉన్న మహిళలు, కార్యకర్తలు

అభిమాన నేతకు ఆత్మీయ స్వాగతం

- ఎయిర్‌పోర్ట్ నుంచి జాతీయరహదారిలో జనసందోహం
- ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించిన ఆడారి ఆనంద్‌కుమార్
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం జగన్



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆనంద్ కుమార్

గోపాలపట్నం: అభిమాన నేతకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొనేందుకు మంగళవారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయం జంక్షన్ నుంచి జాతీయ రహదారి పొడవునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఎయిర్‌పోర్టు జంక్షన్‌లో ఉత్తర నియోజకవర్గానికి చెందిన పాస్టర్ల సంఘం సభ్యులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 14 వార్డుల ప్రజలు వెల్‌కమ్ సీఎం సర్ అంటూ ప్లకార్డులతో స్వాగతించారు. ముఖ్యమంత్రి వారికి అభివాదం చేస్తూ వెళ్లడంతో కాన్వాయ్ మెల్లిగా వెళ్లడంతో కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు, కార్యకర్తలు క్రమశిక్షణలో నిల్చుని సహకరించడంతో పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద కార్యకర్తలకు అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో మెల్లగా వెళ్తున్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రిని కలిసిన ఆడారి ఆనంద్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోర్టు ఆస్పత్రి వద్ద ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన ప్రాంగణం వద్ద ఆయన్ను కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఎన్‌ఏడీలోని వంటిల్లు జంక్షన్ వద్ద కలిసే అవకాశం లేకపోవడంతో ప్రత్యేకంగా ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన ప్రాంతానికి వెళ్లి, కలిశారు.



మహిళలు, కార్యకర్తలతో ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు తదితరులు

జోన్-5లో 92 శాతం పింఛన్ల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో 24 వార్డులకు సంబంధించి సుమారు 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని యూసీడీ ఏపీడీ చిరంజీవి తెలిపారు. జోరువానలోనూ పింఛన్ల పంపిణీ జరిగింది. లబ్ధిదారులకు సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు పింఛన్లు అందజేశారు. జోన్ పరిధిలో మొత్తం 26,354 మంది లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మరో రెండురోజుల్లో 100 శాతం పూర్తి చేయాలని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

4 నుంచి విస్కా సాంస్కృతిక విజయోత్సవాలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7 వరకు సాంస్కృతిక విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని విస్కా కార్యదర్శి ఎ. కేశవరావు, ఆంధ్రకేసరి కళాక్షేత్రం కార్యదర్శి సిహెచ్.వి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విస్కా ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 4న నాట్యోపాసన పురస్కార గ్రహీత లావణ్య శిష్య బృందం భరత నాట్య ప్రదర్శన, 5న డాక్టర్ మీగడ రామలింగస్వామిచే 'తెలుగు పద్య నాటకం-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ప్రసంగం ఉంటాయన్నారు. 6న ఆదివారం లలిత గీతాల మృదు మంజుల సంగీత విభావరి, 7న సోమవారం నంది అవార్డు గ్రహీతలు పి.బాలాజీ నాయక్ నేతృత్వంలో 'గుడి ఎనక నాసామి' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కళాభిమానులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కొత్తపాలెం అండర్ పాస్‌వే వద్ద ట్రాఫిక్ జామ్

- గంట పాటు నిలిచిన వాహనాలు
- క్రమబద్ధీకరించిన గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు



ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న వాహనాలు



నిలిచిన టాటా ఏస్

గోపాలపట్నం: గోపాలపట్నం నుంచి కొత్తపాలెం వెళ్లే రైల్వే అండర్ పాస్ వద్ద మంగళవారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అండర్‌పాస్‌వేలో గోపాలపట్నం నుంచి కొత్తపాలెం వెళ్తున్న టాటాఏస్ నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సుమారు గంట పాటు వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఉద్యోగాలకు, పాఠశాలలకు వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. నిలిచిన ఆటోను అక్కడి నుంచి తొలగించడంతో సమస్య తీరింది.

అప్పన్నకు ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం నిర్వహించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ .. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

ఉక్కునగరం: పౌర్ణమి సందర్భంగా స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన ప్రదక్షిణలో భక్తుల గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డుపైనే వ్యర్థాలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం నుంచి గ్రామాభ్యుదయ ప్రైవేటు మార్కెట్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. మార్కెట్‌కు చెందిన వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. రహదారిపై వ్యర్థాలు వదిలేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. అటుగా రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. సమీప గెడ్డల్లో చెత్త వేయడంతో మురుగు ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. అసలే వర్షాలు.. అంటు రోగాలు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి. పారిశుధ్య అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించాలి.

– సర్వసిద్ధి గౌరీశంకర్, గొల్లకంచరపాలెం



అధ్వానంగా మార్కెట్ రహదారి

అనారోగ్యంతో విద్యార్థి ఆత్మహత్య



మృతుడు సూరజ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌కు చెందిన వడ్డాన సూరజ్(15) పదో తరగతి విద్యార్థి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. చంద్రనగర్ సత్య రెసిడెన్సీలో నివాసం ఉంటున్న తాతయ్య వడ్డాన విశ్వేశ్వరరావు వద్ద సూరజ్ ఉంటున్నారు. అయితే కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో బెడ్ రూమ్‌లో తలుపులు వేసుకున్నాడు. సుమారు 7.50 గంటల సమయంలో తాతయ్య విశ్వేశ్వరరావు తలుపులు తీసేందుకు యత్నించినా రాకపోవడంతో తలుపులు పగలుగొట్టి తెరిచారు. గదిలో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకున్నా డు. వెంటనే కుటుంబ సభ్యులు కిందకు దించి గోపాలపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. పోలీసులకు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తల్లిదండ్రులు సివిల్ కాంట్రాక్ట్ పనుల కోసం మహారాష్ట్రలో నివాసముంటున్నారు. సీఐ ఈదుల నరసింహారావు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ ఈశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

17 నుంచి సీపీఐ బస్సు యాత్ర

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం ఈ నెల 17 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17న ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి ప్రారంభం కానున్న యాత్రను సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రారంభిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎం.ఎస్. అప్పారావు, కసిరెడ్డి సత్యనారాయణ, జె.రామకృష్ణ, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

29వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్షా శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు మంగళవారానికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాద అప్పారావు, కదిరి సత్యానందం, కదిరి సత్తెయ్య, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు కేంద్రానికి లేదు



ఉక్కు అమరవీరులకు నివాళులర్పిస్తున్న యూజ్ నాయకులు

ఉక్కునగరం: జాతీయ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయీస్ (యూజ్) నాయకులు అన్నారు. భారత మాజీ ప్రధాని దివంగత పి.వి.నరసింహారావు విశాఖ ఉక్కును జాతీయాకరణ చేసి 31 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం యూజ్ ఆధ్వర్యంలో స్మృత్యంజలి పార్కు వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ జాతీయాకరణ చేసిన తర్వాత జాతి సంపదగా ఉంటుందన్నారు. కేంద్రం ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి.కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య, ఎస్.అమ్మన్న, ఆర్.సత్యనారాయణ, కె.రామ్‌కుమార్, జి.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి ఆలయంలో లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా మంగళవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10 వేలు చెల్లిస్తే వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూర్చుతుందని తెలిపారు. అమ్మవారిని డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గుడ్ల తనూజ దంపతులు దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీచక్రనవవర్ణార్చన

కనకమహాలక్ష్మి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రనవవర్ణార్చన, లక్ష్మీహోమం ప్రత్యేక పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన పూజలో ఇద్దరు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.2,516 చెల్లిస్తే దంపతులను అనుమతించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూర్చుతుందని తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొని తరించారు. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

3న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 3న సహస్ర తులసి పూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలన్నారు.

కేంద్రప్రభుత్వం దిగి వచ్చేవరకు ఉద్యమం



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఉద్యమం కొనసాగిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 901వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.